కవితా కౌముది

# దృశ్యం

డా.పాతూరి అన్నపూర్ణ

దృశ్యం ఓ అద్భుతం.
కళ్ళకు మాత్రమే దొరికిన అపురూప వరం
కనిపించిన ప్రతి దృశ్యం
కళ్ళ కెమెరాలో బంధీ ఔతుంది
నిక్షిప్తమైన నిధుల్లాంటి దృశ్యాలెన్నింటినో
కనురెప్పల వెనక దాచుకుంటాయి కళ్ళు
అప్పుడప్పుడు మనో యవనికపై
కదిలే బొమ్మల్లా కొలువౌతాయి
బాల్యం నుండి వృద్ధాప్యం వరకు
అనుభవించిన సమయాలన్నీ దృశ్యాలుగా మారి
జ్ఞాపకాలుగా చర్విత చర్వణం అవుతాయి
అమ్మ ఒడిలోని పడక వెచ్చదనం
నాన్న భుజాలపైన పల్లకి ఊరేగింపు
అన్నీ అందమైన దృశ్యాలే..
పెదవులు బదులివ్వలేని ప్రశ్నలకు
దృశ్యాలు సమాధానం చెప్తాయి
గతం గదుల్లో బంధీ అయిన దృశ్యాలు
కాలంతో పాటు నడుస్తాయి
ఉద్వేగమో,ఉప్పొంగే కన్నీరో
తడిసిన మనసులోని దృశ్యాలను బయట పెడతాయి
ఒక్కో దృశ్యం విషాదాన్ని ఒలికిస్తుంది
మరో దృశ్యం ఆనందాన్ని పెంచుతుంది
భిన్నధృవాల్లాగా దృశ్యాలూ భిన్నమైనవే
వసంతంలో చెట్లు చిగిరించినట్లు
బతుకు పండగలా సాగినప్పుడు
ఆనంద భైరవిని ఆలపిస్తాయి
అనుబంధాలకు చేయందించి
ఆశలకు పాదులు చేస్తాయి
దృశ్యం కావ్యం లాంటిది
బతికినంత కాలం కళ్ళ వేదికపై
ఎన్నో ఆవిష్కరణలు జరుగుతుంటాయి
అంతంలేని ఈ దృశ్యాల ఆగమనం
జీవితాంతం మనిషికి అనుభూతిని ఇస్తుందని
రెప్పల వెనుక స్వప్నాలెన్నో చెప్తాయి.

★★



# ఓయ్..! 

రవి కిషోర్ పెంట్రాల

ఓయ్ అసలేమిటోయ్
వద్దనుకున్నా వదలవేంటి
ఎన్నిసార్లు చీదరించుకున్నా
కొంచెమైనా సిగ్గుగాలేదూ!
అవునులే నాకూ తెలుసులే
మన పరిచయం ఇప్పటిదా
స్పృహ తెలిసిన రోజులనాటిది
అంత తొందరగా నన్ను వదలవులే!
అప్పట్లో సందు దొరికినప్పుడల్లా
దరిచేరి పలకరించబోయేది నన్ను
ఆటాపాటలలో మునిగి
అస్సలు పట్టించుకునేదిగాదు నిన్ను!
యవ్వనపు సంధ్యలోనూ
నీకు ఎవ్వరూ దొరకనట్టు
నా వెనకబడి దోబూచులాడేది
నేనేమో లెక్కచేయక ఊహల వెంటబడేది!
నిన్ను వదిలించుకోవాలని
జీవితపు యుద్ధరంగంలో
ఉద్యోగమూ జంటనూ వెతుక్కున్నా
అయినా నా వెంటబడి విసిగించబోయేది!
ఊహలకు ప్రాణంబోసే ప్రయత్నానికి
మోకాలడ్డుతూ వెంటబడుతూ
నామీద అంతులేని మోజుబడేది!

పిల్లలు ఎక్కొస్తున్నా
జీవిత భాగస్వామి పక్కనున్నా
పదే పదే వెంటాడుతూ
దొరికినప్పుడల్లా ఇబ్బంది పెట్టబోయేది!
వయస్సు మీదపడ్తున్నా
పిల్లలకు పెళ్లాడే వయస్సొచ్చినా
ఏం పావుకుందామనో
నా ముంగిట్లో విడువక తిష్టవేయజూస్తూ!
ఇన్నాళ్లూ పట్టించుకోలేదు పర్లేదు
ఇకనైనా ఇప్పటికైనా సరే
నిన్ను సాదరముగా ఆదరించమనడం
ఏమైనా సమంజసమేనా!
నేను ఒంటరినైపోతాననేమో
ఎల్లప్పుడూ నీడలా నడుస్తున్నట్లున్నావ్
ఎంత ఆప్యాయత నీకు
నిన్నాహ్వానించాలన్న ఆసక్తి నాకు లేదులే!
ఓసారి ముద్దుగా పిలవనా నిన్ను
ఓయ్ 'కష్టం'
దుఃఖం తోబుట్టువా
కడగండ్ల కజిన్!
అత్యాశే నేమోగాని ఓ విన్నపం
కొంత సమయం
అపరిచితులమవుదామా
ఏదోరోజు అనుకోని అతిథిగా వద్దువుగానిలే!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బిచ్చోటి

హిమసుమంబులు సందేశమేమి తెచ్చు?
రాలు చినుకుల పలుకుల రాసులేమి?
మధుపనాదములోని యా మాటలేమి?
కదలి సాగెడు ప్రాణుల కబురులేమి?

విహగములు నన్ను రమ్మని పిలుచుచుండు
నేవియో రహస్యములు నాకెరుగజేయ
నీరదమ్ములు వెడలుచు నింగిలోన
నిలుచు నాకేవొ మంచి మాటలను తెలుప

నిశ్చలమ్ముగ సాగెడు నిర్ఝరములు
మెల్ల మెల్లగ వీచు సమీరణములు
ఇలకు జేరెడు నీహారజలకణములు
సృష్టి సత్యములను నాకు చెప్పుచుండె

నింగి నేలను చరములన్నింటికిన్ని
గమనమున్నది, యున్నవి గమ్యములును
గమ్యములు వేరు, గమనవేగములు వేరు
జ్ఞప్తి చేయు నాకవి గమనమును గూర్చి

కదలి పొమ్మంచునాపకు గమనమంచు
ఆగినట్లైన జీవనమాగుననుచు
గమనరాహిత్యమున లేదు కాలమంచు
కాలహరణము వలదంచు గళము నెత్తు

COMMENTS